# శివరామా!

పానుగంటి లక్ష్మీనరసింహారావు గారు

౧

"ఛీఛీ! నోరు కట్టిపెట్టుకో నాకు బుద్ధులు చెప్పెదవా" యని భర్త తీండ్రించుచుఁ దెల్లనిఱాతిపైఁ గత్తిని నూరుచుండెను. కత్తి యాఁదోఁకవాటమైన నల్లని రెండడుగుల పిడిలో నష్టమీచంద్రాకృతిగల యుక్కుతునుకతో నుండెను. పిడికి నడుమ నడుమ నిత్తడికట్టులుండెను. కత్తి యందముగనే యున్నది. అందులో ఱాతిపైఁ దిరుగవేసిబోర్ల వేసి నూరుచున్నప్పు డెదుటిదీపఁపుగాంతి దానిలోఁ బ్రతిఫలించుటచే మఱింత యందముగా నుండెను. నడుమనడుమఁ గత్తియంచు నెడమచేతి తర్జనికొసతోఁ నాతఁడు పరీక్షించుచు నింక నూరుచుండెను. "ఈరాత్రి యెవరిని గొంతుఁగోయ దలచినావ"ని భార్యయడుగ, "నీవు నన్నింక నడ్డుపెట్టినయెడల నీగొంతుకయే" యని భర్త బదులు చెప్పెను. అటుపైని 'నెవరిదని భార్య' యడుగఁ "బనికిమాలినముండా! నీగదిలోనికిఁ బోయి నోరుమూసికొని పండుకో. నీ కూరివారి వ్యవహారముల గొడవ యెందులకు? నావ్యాపార రహస్యము లెందులకు? అదిగాక నేనీరాత్రిఁ యేదో పెద్దలాభమునుపొందఁదలచి మహోత్సాహమున సర్వ సన్నాహములను జేసికొనుచుండగా నపశకునపు ముండా! తీతువా! యెక్కడికి? యెందులకని యడిగెదవా? నేనెప్పుడు కత్తినూరుకొన్నను నీవు కంటిలో నిప్పులు పోసికొనుటయే కదా? నేనెప్పు డుత్సాహమున నూరిలోనికిఁ బోయినను నీవడ్డుతగులుటయే కదా! దరిద్ర దేవతవు దాపురించినావు. నీమూలమున నేను గూటికి గుడ్డకు గతిలేకుండ నున్నాను. ఈసారిమాటలాడినయెడల ముక్కల క్రింద నఱకెదను. జాగ్రత్త" యని మగఁడు గద్దించెను.

ఈమాటలకుఁగూడ రామలక్ష్మి జంకలేదు. ఔను, యెందులకు జంకును? దొంగయనఁగ నింటివాఁడు జంకునుగాని చోరుని పెండ్లామున కేమిభయము? గొంతుకోతవాని భయము వీథిలో బాటసారికిఁగాని యింటిలో నున్న యిల్లాలి కేమి? మనకు నబాబుగారు గాని పెండ్లామునకు మామూలు పిల్లిగడ్డపుఁ మగఁడే కాదా! "నన్ను నఱకెదనంటివి కానీ! నీవూరివారల తలలు నఱకి ధనముఁ దెచ్చుకొనుటకంటె నాతల నఱికి నీకడ్డువచ్చుచున్న నన్ను

బోఁగొట్టుకొనుట మంచిది కాదా! "నాబాధ తీరును; నీబాధ తీరునని రామలక్ష్మి నిర్భీతిగఁ బలికెను. అంతటఁ బండ్లుఁ గొఱుకుచు శివయ్య లేచి "ఏదీ కఱ్ఱయని" మూలనున్న బడితెను దెచ్చి రామలక్ష్మి మూఁతిపైఁ బొడిచెను "శివశివా" యని యఱచుచు నామె కన్నులు తిరుగఁ గొంతసేపు కూలఁబడియెను. నోటి వెంటవచ్చు రక్తమును నీటిని బుక్కిలించి యూఫుకొనెను. "నీవు మంచి యింటిలోని వాఁడవు. చదువుకొన్న వాఁడవు. ధనవంతుఁడ వని మాతండ్రి నన్ను నీకిచ్చినాఁడు. నేను నీ యింటికి రాకుండగనే ధన మంతయు వ్యభిచారవృత్తిలోఁ దగులఁబెట్టితివి. అంత జూద మారంభించితివి. అందులోఁ గిట్టుబాటులేక దొంగతన మారంభించితివి. అటుపై బందిపోటు దొంగవైతివి. ఎందఱియిండ్లో దూరితివి! ఎందఱితలలోఁ గొట్టితివి! తుదకేమిసంపాదించితివి! పీసమెత్తు బంగారమైన లేదుగదా వింధ్యపర్వతమంత పాపము సంపాదించితివ"ని రామలక్ష్మి పలికెను.

శివ—ఇంటిలో నెల్లప్పు డేడ్చుచున్న పెండ్లామున్న ముండకొడుకున కింత కంటె మంచిగతి పట్టునా? ఏదియు లేకపోయెనని నీ వింక మొత్తుకొననక్కఱలేదు. ఈ రాత్రితో మనము కొన్ని వేల కధికారులమగుట నిజము. ఆధనమంతయుఁదీసికొని యేదోదూర దేశము నకుఁబోయి యక్కడ సుఖముగ జీవింతము.

రామ—ఆదూర దేశములో నిక్కడ నున్న భగవంతుఁడే యున్నాఁడా? అక్కడ వేఱొకఁడా? ఇక్కడ నున్న మంచిచెడ్డలే యక్కడనున్నవా యక్కడ వేఱుగనున్నవా? మంచివాఁడు కాటిలోనున్నను గాశిలోనున్న ట్లే. ఇక్కడనుండి స్థలము మార్పఁగలవుగాని బుద్ధిమార్పఁగలవా?

శివ—ఈరాత్రి చేతిలోఁ బడవలసిన దేదో వేసికొన్న తరువాతఁ దిరుగ నీవృత్తి నవలంబింతునా? ధనము కొఱకు గాదా వృత్తి, డబ్బు చేతిలోఁ బడనీ? తిరిగి మడికట్టుకొని యింటిలో దేవతార్చన, వాకిట్లో వ్యవహారముల తీర్మానము, గ్రంథాలయములలో నగ్రాసనాధిపత్యము, కాంగ్రెసులో రాజకీయోపన్యాసములు పెళ్లిన జరపకపోవుదునా? ఏమన్నది? అన్ని వన్నెలు చిన్నెలు ధనములో నున్నవి. అదిలేక యిట్లుంటినిగాని నాకుమాత్రము ప్రాణనాశనము పంచదార యనుకొంటివా?

రామ—ఈరాత్రి యెవరినైనఁ జంపక తప్పదా? ఆమాట ముందు చెప్పుము.

శివ—అది బ్రహ్మదేవు డడ్డుపడినను దప్పనది కాదులే. ఎటువచ్చినను వాఁడు వ్యతిరేకింపకుండ మనసొమ్మేదో మనకుఁ బాఱవైచినయెడల నాదొడ నీదొడ నాల్గు లెంపకాయలతోమాత్రము తీరును. ఊరిలో వాఁడెవఁడో చచ్చినయెడల మనకు విచారమెందులకు? మన సొమ్మేదో మన చేతిలోఁ బడనీ! మనము చంపకపోయినను వాఁడేలాగో వాని కర్మానుసారముఁ జావవలసినవాఁడే. 'నిమిత్త

మాత్రం భవసవ్యసాచిన్' అని గీతలో లేదా? ఇందుకొఱకు విచారింపనేల?

రామ—నేనెందులకు విచారించుచుంటి ననఁగా: మీ దుర్నయముచేతనే మీ మహా ఘోరపాప కృత్యముచేతనే మనకు ముగ్గురు పిల్లలు కొంత పెరిగి పోయినారు." ఇప్పటికి మిగిలియున్న యీపిల్లవానినైన సత్ప్రవర్తనచేఁ దక్కించుకొనక తప్పదు.

శివ—ఛీఛీ! వట్టి తెలివితక్కువమాట లాడకు. నాకఱ్ఱపేటునకుఁ గుఱ్ఱవాండ్రచావునకు సంబంధమేమి? పాశ్చాత్యదేశచరిత్ర నీకుఁ దెలియకపోఁబట్టి నీవట్లనుకొనుచుంటివి. ఒక్కొక్క దేశములో మతసంబంధములైన తగవులు వచ్చినప్పుడు లక్షలకొలఁది జనులు హతులు కాకమానిరా? వారిని జంపినవారికిఁ బిల్లలు చచ్చిరా? భార్యలు చచ్చిరా? ఏమియులేదు. వారు సర్వసౌఖ్యముల ననుభవింపలేదా? దేని దారి దానిదేకాని ప్రపంచవ్యవహారములలోఁ గారణసాంకర్యముమాత్ర మెన్నఁడు జరుగదు.

రామ—నాకిన్ని తెలియవు. నీవు ముగ్గుఱుతలలు కొట్టినావు. మనకు ముగ్గుఱుపిల్లలు చచ్చినారు. నాలుగవహత్యకు సిద్ధపడియున్నావు. ఈపిల్లవానినిగూడఁ జంపుకోఁదలఁచితివా?

శివ—ఈపిల్లవాఁడు సుఖముగ జీవించుటకొఱకే యీరాత్రి యింతధనము సంపాదింపఁదలఁచితిని. నాయొక్కని నెత్తినే గట్టుకొనుటకుఁ గాదు. నీవు కిక్కురుమనకుండ నుండుము. నేను బోయెదను ...............

అనిపలికి నల్లలాగు నల్లచొక్కా తొడుగుకొని మొగమునకుఁ బైభాగమున నుదుటివఱకు నడుగుభాగమున ముక్కుక్రిందవఱకుఁ గప్పునట్లు నల్లనిటోపీ పెట్టుకొని కాసెబిగించి కత్తి చొక్కా యెడమ చేతిలోఁ గ్రమ్ముదలగా నుంచి పట్టుకొని యాతఁడు బయలువెడలఁగ రామలక్ష్మి నడవ గుమ్మమున కడ్డుగ నిలువఁబడి "నేను నిన్నుఁ బోనీయ"నని యెదుర్కొనెను. శివయ్య యుగ్రుఁడై కుడిచేతితో నామె తలవెండ్రుకలను గ్రహించి మండువాలోఁబడు నట్లీడ్చెను. దభాలునఁ బడి శివశివా యని యామె గొంతెత్తి యేడ్వసాగెను. "నీగొంతుక కోయ గట్టిగ నేడ్చినయెడలఁ జుట్టుపట్టులనున్న యిండ్లవారు వినరా? నీవు ముండమోయ: నన్నల్లరి పెట్టెదవా? నాదారిని నన్ను బోనీయవా? ఏడ్చినయెడల గొంతుక నులిమెదను" అని యామెగొంతుకపైఁ జేయివైచెను. "శివరామా! శివరామా! నాతండ్రీ!" యని రామలక్ష్మి యడఁగిన గొంతుతో నాక్రోశించెను. "అమ్మా అమ్మా" యనుచు నొక బాలుఁడు గదిలోనుండి యీవలకువచ్చి మండువాలోఁ బడి యేడ్చుతల్లిని గాంచి యేడువ సాగెను. "నాయనా! నీవెందులకు వచ్చితివి? లోనికి బోయి పండుకొను"మని తండ్రియాతని మందలించెను. కాలవసనధారియై భయంకరస్వరూపుఁడైన తండ్రినిజూచి తల్లిని గౌగిలించుకొని మరింత యేడువ సాగెను. "నాయనా! శివరామా! నన్నుజూచి భయమెందుకు? నేను నీతండ్రినిగానా?" యని కొడుకును బుజ్జగింపుచు, నాతనిచేయి పట్టుకొని "రా నాయనా!

లోనికిరా పండుకొందువుకాని" యని పిల్లవానిని లాగెను. నేను రానను నట్లు పిల్లవాఁడు తన కుడిచేతిని పైకెత్తి యడ్డముగ నూపెను. తల్లి పుత్త్రుని గట్టిగఁ బట్టుకొనెను.

పిల్లవాఁడు మూఁడేండ్లవాఁడు. దృఢశరీరి. తల్లివలెనే గుండ్రనిమోము గలవాఁడు. తల్లివలెనే దబ్బపండువంటి చాయగలవాఁడు. తండ్రివలె గ్రద్దముక్కు కలవాఁడే. కాని తల్లివలె రవంతపొడుగు గడ్డముకలవాఁడు. అతనికి మాటలింకఁ దిన్నగవచ్చిన ట్లగపడదు. "పిల్లవానిని బట్టుకొందువేల? వదలు"మని శివయ్య భార్యతో ననెను. భార్య వదలలేదు. భర్తయు భార్యయు నిట్లు గుంజుకొను సమయమున శివయ్య చొక్కా యెడమచేతిలోనున్న పోటుకత్తిజాఱి పిల్లవానితొడపైఁ బడెను. మొఱ్ఱో యని పిల్లవాఁ డేడ్చెను. తల్లి యేడ్పునకు హద్దేలేదు. పెద్దగాయముకాదు కాని రక్తము మెండుగ వచ్చెను. అంత శివయ్య తొందరతో నొకప్రాఁతగుడ్డ కాల్చి యామసి గాయమున కంటించెను. నెత్తురు కట్టెను. పిల్లవాని నెత్తికొని తల్లి గదిలోనికిఁ బోయి యాతనిఁ బ్రక్కలో వైచుకొని పండుకొనెను. శివయ్య యామంచమునొద్దనే పిల్లవానివంకఁ జూచుచుఁ గూరుచుండి యుండెను. పిల్లవాఁడు గొంత సేపటికిఁ దల్లితోఁగూడ నిద్రించెను. ఆపిల్లవాని నట్టే కొంతసేపు తండ్రి నిశ్చలదృష్టితోఁ జూచి యుండుపగింజలంతటి రెండు వెచ్చనిబాష్పములవిడిచెను. "పిల్లవానిని నిమ్మళముగ ముద్దుపెట్టుకొని లేచి తల్లికూడ నిద్రించినది. ఇంత గొడవ జరిగినతరువాత నింత దెబ్బ పిల్లవానికిఁ దగిలినతరువాత నేను వీథిలోనికిఁబోవనని నిశ్చయముగా నమ్మి నిర్భయముగా నిద్రపోవుచున్నది కాని వెళ్ళక తప్పదు. అదను రవంతయుఁ జెడగొట్టుకొన్నప్పు డాపైన నేడ్పుతక్క మఱియేమున్నది? అనుకూలముగుగాలి విసరునప్పుడు చాఁప యంకారింపకమానవచ్చునా? ఏమైన సరే? పోయెద"నని తనలోఁ దా ననుకొని లేచి పిల్లవానివంక నార్ద్రమౌగు దృష్టితోఁ జూచి వంగియే యాతనిని నిమ్మళముగ ముద్దుగొని, గదియావలికివచ్చి తలుపుదగ్గఱగఁ బెట్టి యిల్లు వెడలి వీథితలుపునకుఁ జైన తాళమువైచి పోయెను.

౨

గదిలో గంటవలె దీపము వెలుగుచున్నది. ఇనుపపెట్టెపై గడియారము పండ్రెండు కొట్టుచున్నది. పట్టెమంచముపైఁ బండువంటి యొక ముసలియాతఁడు కూరుచుండి జపమాల త్రిప్పుకొనుచున్నాఁడు. ఓరగనున్న తలుపునందునుండి శివయ్యదూరియాతని యెదుటఁబడినాఁడు. "ఆ" యని పెద్దకేక యావృద్ధుఁడు వేయఁబోవఁగఁ బోటుకత్తిని శివయ్య చూపి నోరుమూసికొనుమని సంజ్ఞ చేసినాఁడు. ఇనుపఁబెట్టె తాళ మిమ్మని శివయ్య యాతనికి సంజ్ఞ చేసెను. ఈయనని జపమాలాధారి తిరుగ సంజ్ఞ చేసెను.

ఆదినమునందే యాతనిబంధువు లందఱు పొరుగూరికి వివాహమున కేగినారు. ఆతఁడొక్కఁడే యామేడలో నున్నాఁడు. క్రిందనున్న భటుని గికురించి శివయ్య మేడపై నెక్కినాఁడు. "ఈయవా? ఈయవా? ఈయకపోయిన నఱకెదను" అని శివయ్య నిమ్మళముగఁ బలికినాఁడు.

డు. "నేనీయను నఱకు"మని ముసలియాతఁడు ప్రత్యుత్తర మిచ్చినాఁడు. ధనము కొఱకుఁ బ్రాణములు పోఁగొట్టుకొనుట బుద్ధిలేనిపనియని శివయ్య పలుకగా ధనముఁ గొఱకు వంశనాశనము చేసికొనుటకంటె మంచిదే" యని ముసలి యాతఁడు ప్రత్యుత్తరమిచ్చెను. "ధనాహరణమునకు వంశనాశనమునకు సంబంధ మున్నదని మూఢురాలయిన నాభార్య చెప్పినట్లే చెప్పితివే" యని శివయ్య యొక్క నిముస మూరకుండి "చావు"మని కత్తియెత్తి నఱకఁబోయెను. ఎత్తినచేయి యెత్తినట్లే యున్నది. పట్టినకత్తి పట్టినట్టే యున్నది. తెఱచినకన్నులు తెఱచినట్లే యున్నవి. ముందునకు వైచినకాలువైచినట్లే యున్నది. రవంత వంగినశరీరము వంగినట్లే యున్నది. ఆతఁడట్టె ప్రతిమవలె నిలువఁబడినాఁడు. ఎందుచేతనో? ఆతనికన్నులకేమైన నగపడెనా? ఇంతలో ముసలియాతఁడు "కత్తి యెత్తినవాఁడవూరకుంటివేల, కాని" యని పలుకగ నాకస్మికముగ నదఱిపడి యొడలట్టె ముడుచుకొని "హుహు" యని సకిలించి తిరుగ బిఱ్ఱబిగిసి "యీసారి చావు"మని కత్తి తిరుగ నెత్తెను. ఎత్తియేమిచేసెను? ఏడ్చినాఁడు. ఏమని? "నాయనా! శివరామా! నీవెందుల కిక్కడకు వచ్చితివి తండ్రి! నఱకవలదని చేయి యెత్తి యడ్డముగ నూపుచుంటివా? నఱకనులే; నీవు చిరంజీవివై యుండుము" అని యేడ్చి, కత్తి యావలఁబాఱవైచి, "శంకరశాస్త్రీజీ! నమస్కారము. క్షమింపుఁడు. సెల"వనిపలికి వెనుకకుఁ బోవసాగెను. శంకరశాస్త్రి యాతని కడ్డ దగిలి "పోయెదవేల? నీకుఁ గావలసిన సొమ్ము తీసికొని పొ"మ్మనెను.

శివయ్య కన్నులు దుడుచుకొని తన పూర్వచరిత్ర మారాత్రి జరిగినంతవఱకుఁ జెప్పి, "మీదర్శనమున నాపాపవృత్తి నశించినది. నేనింక నిష్పాపమైన వృత్తి నవలంబించి బ్రదికెదను. భార్యను, బిల్లవానిని జూడఁ ద్వరగఁ బోవలయును. వారింటిలోనుండ నింటికిఁ దాళము వైచి వచ్చితినని చెప్పియుంటిని. ఈలోపల నాభార్యకు మెలకువయగునెడల నెంత యేడ్చునో! ఏమియుపద్రవము సంభవించునో: నాకు వేగ సెలవిండు: అయిదుమైళ్లు పోవలయును." అని శివయ్య పలికెను. "అయిదువేల రూపాయలు నీకిచ్చెదను. నీవు వానినిదీసుకొని సద్వృత్తినవలంబించి బ్రదుకు"మని ముసలియాతఁడు పలికెను. "నాకక్కఱలేదు. మిమ్మింత సత్ప్రవర్తకుని, సంపద్వంతునిఁ జేసిన శంకరభగవానుఁడే నన్నుఁ గూడఁ గటాక్షింపఁగలఁడు. దయయుంపుఁడు" అని పలికి శివరామ శివరామ యని స్మరించుకొనుచు నింటికిఁ బోయెను.

